క్లుప్తంగా

ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తి వివరాలు ఉండాలి



నెహ్రూనగర్: ప్రతి పోలింగ్ కేంద్రంలో పీఎస్ నంబర్, బీఎల్ఓ పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్, తూర్పు ఈఆర్వో పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఉర్దూ స్కూల్‌లోని 124, 125, 126, 132 నుంచి 136 వరకు, 139 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో అందిన ఫారాలు పక్కాగా ఆన్‌లైన్ చేయాలన్నారు. క్యాంప్‌లలో ప్రజల నుంచి నూతన ఓటు కోసం దరఖాస్తు అర్జీలు తీసుకోవడం జరిగిందన్నారు. ఓటర్ కార్డులో చిరునామా, పేరు, పుట్టిన తేదీ తదితర మార్పులకై అర్జీలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో ప్రారంభమైన ఆహ్వాన క్రిస్మస్ వేడుకలు



నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబర్ 25 క్రిస్మస్ పండుగ నెల రోజులు ముందు నుంచి క్రైస్తవులు ఆహ్వాన, సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటారు. ఈ మేరకు ఆదివారం కన్నవారితోటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి(రెగ్యులర్ సర్వీస్) ఆధ్వర్యంలో ఆహ్వాన క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా విజయవాడకు చెందిన రెవ డాక్టర్ అబ్షలోము హాజరై వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ రెవరెండ్ వి.దాసు బాబు, చైర్మన్ జి.లింగయ్య, సెక్రటరీ వై.సోమయ్య, వైస్ చైర్మన్ కె.అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులు యు.దేవదాస్, జాయింట్ సెక్రటరీ పి.బాబూరావు, ట్రెజరర్ ఎస్.దానయ్య, ఫంక్షనల్ అడ్వైసర్ ఎం.జవహర్ బాబు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం ఐపీడీ కాలనీలోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ సభ్యులందరినీ ఒకచోటకు చేర్చి కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో రూ.కోటి వరకు సమాజహిత సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ అవోపా సభ్యులు క్రమశిక్షణకు మారుపేరని, అవోపాకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని అన్నారు. ఈసందర్భంగా పిల్లలతో పాటు పెద్దలకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ముందుగా 50 జంటలు వేద పండితులు తాతాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, రాచపూడి సుబ్బారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

మారథాన్ విజేతలకు జిల్లా ఎస్పీ అభినందనలు



నగరంపాలెం: పరుగు పందెంలో ప్రతిభ చూసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం అభినందించారు. ఈనెల 17న విజయవాడ జింఖానా మైదానంలో మారథాన్ 21 కి.మీ. పరుగు పందెం పోటీలు జరగ్గా, నల్లపాడు పీఎస్ ఏఎస్ఐ కె.రాజశేఖర్‌బాబు, జిల్లా యూనిట్‌లోని హోంగార్డు ఎ.కృష్ణకిషోర్ విజేతలుగా నిలిచారు. ఇద్దరిని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు. మరెన్నో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

తుక్కు చేసినా... తెలియజేయాల్సిందే...

- వాహనం తీసివేస్తే.. దరఖాస్తు తప్పని సరి
- స్క్రాప్‌కు వేస్తే.. వాహనం వద్దకునున్నా..
- స్పష్టంగా దరఖాస్తు ఎంతో అవసరం
- ఏదైనా ఘటన జరిగితే వాహన యజమానిదే బాధ్యత



తుక్కు తుక్కు చేసిన వాహనాల చిత్రం



గుంటూరు జిల్లా ఆర్టీఓ కార్యాలయం

పట్నంబజారు: ఆ.. పాత వాహనమే కదా.. పోతే పోయిందేలే అనుకుంటే పొరపాటే. ప్రతి వాహనం కొనుగోలు చేసిన తరువాత దాని కాల పరిమితి 15 సంవత్సరాలు. ఆ తరువాత వాహన ఇంజన్ పరిస్థితిని బట్టి ఐదేళ్ల నుంచి మరింత పైగా వాహనాలకు కాలపరిమితిని పెంచే అవకాశం రవాణాశాఖ అధికారులకు ఉంది. కేవలం నూతన వాహనం కొనుగోలు చేసే క్రమంలో ప్రతి ధ్రువీకరణ పత్రాన్ని చూస్తాం. అలాగే వాహనం అది ద్విచక్రమైన, కారైనా, అంబులెన్స్, ఆటో మరేదైనా.. కచ్చితంగా వాహనం స్క్రాప్ (తుక్కు) చేసే ముందుకు అధికారులకు దరఖాస్తు ఎంతో అవసరం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి. లేకుంటే ఆ వాహనంతో ఏదైనా ప్రమాదం జరిగినా.. ఏదైనా ఘటన చోటు చేసుకున్నా.. ఆ వాహన యజమాని కచ్చితంగా బాధ్యత వహించాల్సిందే.

గత కొన్ని రోజులుగా...

గత కొద్ది రోజుల క్రితం గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, మరో బైక్ ఢీ కొట్టుకున్నాయి. అందులో ప్రమాదానికి కారణమైన వ్యక్తి సంగతి అటుంచితే.. ఆ వ్యక్తి వాహనాన్ని విక్రయించిన తరువాత తన పేరుపైకి మార్చుకోకపోవటంతో, పాత యజమాని పేరుపైనే బైక్ ఉండటంతో కేసు నమోదు అయిన సమయంలో అతడిని నిందితుడిగా పేర్కొనాల్సి వచ్చింది. అలాగే ఒక తెనాలికి చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆటోను స్క్రాప్ కింద విక్రయించేశాడు.. అయితే రవాణాశాఖ ఒక పనినిమిత్తం వెళ్లాడు. తన ఆధార్‌కార్డు నెంబర్ చెప్పిన క్రమంలో పాత ఆటోకు సంబంధించి త్రైమాసిక పన్నులు పెండింగ్ ఉన్నట్లు చూపటంతో.. సదరు అధికారులు ఈ విషయాన్ని ఆటో డ్రైవర్‌కు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఆర్టీవో అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో వాహనాలు..

జిల్లాలో మొత్తం సుమారు రెండు లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయి. వాటిలో 25,436 లారీలు, 1560 మ్యాక్సీ క్యాబ్‌లు, 6332 మోటార్ క్యాబ్‌లు, 16,179 కమర్షియల్ ట్రాక్టర్లు, 29,211 ఆటోలు, 2,800పైగా స్కూల్ బస్సులతో పాటు ఇతరత్రా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉన్నాయి. అయితే వాటిలో అనేక సంవత్సరాలుగా త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు ఉన్నాయి. అధికారుల గణంకాల ప్రకారం ఇప్పటి వరకు 7,500పైగా ఉన్నట్లు గుర్తించారు. వాటిలో ఒక త్రైమాసికం చెల్లించనవి 500, రెండుకుపైగా చెల్లించనవి 323, మూడు త్రైమాసికాలు 270, నాలుగు చెల్లించనవి 300పైగానే, ఐదు త్రైమాసికాలవి 200పైగానే, ఐదుకు పైగా ఉన్నయి సుమారుగా ఐదు వేలకు పైగానే ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.

లేని వాహనాలు ఎన్నో...

జిల్లాలో త్రైమాసిక పన్నులు చెల్లించాల్సిన వాహనాలు 7500 ఉండగా వాటిలో అనేక వాహనాలు అసలు లేనే లేవని అధికారులు గుర్తించారు. వేలాది వాహనాలు ప్రమాదాలకు గురైనవి వదిలివేయటం, కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌కు వేయటం, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు తీసుకుని వెళ్ళిన వాహనాల గురించి పట్టించుకోకపోవటం, విక్రయించిన వాహనాల గురించి సమాచారం ఇవ్వకపోవటం వంటివి ప్రధాన గుర్తించారు.

పన్ను పడుతూనే ఉంది...

వాహనాలకు సంబంధించి యజమానుల దగ్గర వాహనం లేనప్పటికీ త్రైమాసిక పన్నులు మాత్రం పడుతూనే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వాహనదారులు వాహనాలు స్క్రాప్‌కు వేసినా, ఇతరత్రా అంశాల్లో కోల్పోయినా.. కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకపోవటంతోనే వాటికి పన్నులు పడుతూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు వాహనాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

దరఖాస్తు తప్పనిసరి

ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతగా వాహనాన్ని తీసేసినా, విక్రయించినా, స్క్రాప్‌కు పంపినా, ఫైనాన్స్ యజమానులు తీసుకుని వెళ్లినా కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలి. లేకుంటే ఏదైనా ఘటన జరిగితే కచ్చితంగా వాహన యజమానే బాధ్యత వహించాల్సి వస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు అయితే.. వాహనాలు మన దగ్గర లేకపోయినప్పటికీ త్రైమాసిక పన్నులు, పైన జరిమానాలు పడుతూనే ఉంటాయని యజమానులు గమనించాలి. స్క్రాప్‌కు వేసినప్పటికీ చాయిస్ నంబర్లు దుర్వినియోగం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి.

–బి.సత్యనారాయణప్రసాద్, ఆర్టీఓ, గుంటూరు

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలపై 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఆనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కాల్ సెంటర్ ద్వారా విస్తృత సేవలు

నెహ్రూనగర్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నగర పాలక సంస్థ కాల్ సెంటర్ విస్తృత సేవలను అందిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర పాలక సంస్థ అందిస్తున్న సేవలపై ఈ నెల 25 నుంచి(ఆస్తి పన్ను మార్పు, ఆస్తి పన్ను విధింపు, నీటి కుళాయిల కనెక్షన్‌లు, కుళాయిల రిపేర్లు, డ్రైయిన్ కనెక్షన్‌లు, రిపేర్‌లు, వ్యాపార లైసెన్సులు, జనన మరణ ధ్రువ పత్రాల మార్గ దర్శకాలు, వివాహ పత్రాల నమోదు) సేవలపై ఎటువంటి సందేహాలు ఉన్నా 0863–2345103, 2345104, 2345105 నంబర్లకు సంప్రదించి సమాచారాన్ని పొందవచ్చున్నారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలైనంత త్వరలో సాంకేతిక అనుసంధానంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ ద్వారా వివిధ ప్రజా సమస్యల పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం నుంచి నగర పాలక సంస్థ సచివాలయాల ద్వారా రెవెన్యూ, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాలలో అందించే సేవలపై సందేహాల నివృత్తికి ఈ కాల్ సెంటర్ ను వినియోగించుకోవాలని కోరారు. నగర పాలక సంస్థ కాల్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 8:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు, సెలవు దినాలలో కూడా సేవలు అందిస్తుందని వివరించారు.

నేటి నుంచి రాకపోకలు నిలిపివేత

మూడు వంతెనల వద్ద..

- రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు చేపట్టిన అధికారులు
- 60 రోజుల పాటు పనులు
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని వినతి



మూడు వంతెనలు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని మూడు వంతెనల(డొంక రోడ్డు) వద్ద సోమవారం నుంచి రాకపోకలు నిలిపివేయనున్నారు. రైల్వే ట్రాక్ ఎక్స్ టెన్షన్ పనుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ నుంచి 60 రోజుల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. దీంతో నగరవాసులకు 60 రోజుల పాటు ట్రాఫిక్ కష్టాలు తప్పేలా లేవు... ట్రాఫిక్ కష్టాలను అధిగమించేందుకు నగర పాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కావాల్సిన చర్యలకు ఉపక్రమించారు.

శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు..

కొత్తపేట(1 టౌన్) నుంచి (2 టౌన్‌కు వెళ్లేందుకు) అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, అమరావతి రోడ్డు వెళ్లే వారు నాజ్ సెంటర్ ఉమెన్స్ కాలేజీ మీదుగా శంకర్‌విలాస్ బ్రిడ్జితో పాటుగా నెహ్రూ నగర్, సంజీవయ్య నగర్ రైల్వే గేటుల మీదుగా 2 టౌన్‌లోకి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అదే విధంగా టూ టౌన్ నుంచి వన్ టౌన్‌కు వచ్చే వారు శంకర్‌విలాస్ బ్రిడ్జితో పాటు, సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటులను మీదుగా రావాల్సి ఉంటుంది. ట్రాఫిక్ సమస్య ఏమి ఉండకూడదు.. కొంచెం ఆలస్యమైన పర్వాలేదు అనుకుంటే కంకరగుంట ఫ్లైఓవర్ కలెక్టరేట్ మీదుగా కూడా రాకపోకలు సాగించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి



మూడు వంతెనల వద్ద రైల్వే పనుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లిస్తున్నాం. మూడు వంతెనలు మీదుగా రాకపోకలు సాగించే వారు శంకర్‌విలాస్ బ్రిడ్జి, అరండల్‌పేట అండర్ పాస్, సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటుల మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కలెక్టరేట్ రోడ్డు, కంకరగుంట ఫ్లై ఓవర్‌ను కూడా వినియోగించాలి.

– ఏ అశోక్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమైనట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బసవ లింగారావు మాట్లాడుతూ పాఠశాలవిద్యలో పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోగా, పాఠశాల పనివేళలను అశాస్త్రీయంగా పెంచి, కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని అన్నారు. తక్షణమే పెంచిన పనివేళలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులను దీర్ఘకాలంగా ఇబ్బంది పెడుతున్న అవసరం లేని యాప్స్ రద్దు చేస్తామన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. అపార్ ఐడీ నమోదులో ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగించాలని విన్నవించారు. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించి 27శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ పీఎఫ్, 11వ పీఆర్సీ బకాయిలతో పాటుగా పెండింగ్ డీఏలు, మెడికల్ రీ–యింబర్స్‌మెంట్, సీపీఎస్, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పుట్టా జనార్ధనరావు, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు కేసన రమేష్, గుడిపాటి దాస్, రాష్ట్ర కౌన్సిలర్ చెట్టిపోగు లక్ష్మణ కుమార్, జిల్లా నాయకులు టి.శరత్ బాబు, షరీఫ్, కిరణ్, శ్రీనివాసరావు, శివన్నారాయణ, మూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

లక్ష్మీపురం: ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ – వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గుంటూరు జీజీహెచ్ ఆటో స్టాండ్ సభ్యుల సమావేశం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 21, 31 లను రద్దు చేయాలని కోరారు. పోలీసులు ఈ – చలానా రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఆర్థిక సహాయంగా రూ.15 వేలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర అధ్యక్షుడు కురాకుల రాంప్రసాద్, నగర సహాయ కార్యదర్శి ఎండీ బాబర్, జీజీహెచ్ ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు శివ, ఈసూబు పాల్గొన్నారు.

సైన్యంలో చేరేందుకు ఎన్‌సీసీ తొలిమెట్టు


ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్



ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థినులతో కల్నల్ చంద్రశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: భారత సైన్యంలో చేరేందుకు ఎన్‌సీసీని తొలిమెట్టుగా మలచుకోవాలని ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం శ్యామలానగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయం వద్ద ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత సాయుధ దళాల యువ విభాగంతో పాటు, సైన్యం, నేవీ, ఎయిర్ ఫోర్స్‌తో కూడిన ట్రై–సర్వీసెస్ ఆర్గనైజేషన్‌గా స్వచ్ఛంద ప్రాతిపదికన పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ సమాజంపై వారికి గల బాధ్యతను నెరవేర్చే విధంగా ఎన్‌సీసీ తోడ్పాటు అందిస్తోందని అన్నారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల సామాజిక సాంస్కృతిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవటమే కాకుండా దేశం పట్ల తమ బాధ్యతను గుర్తు చేస్తూ అందరం సమానమనే భావాన్ని పెంపొందించి పరిపూర్ణమైన వ్యక్తిగా నిలబడేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ కేడట్లు వివిధ విన్యాసాలతో ఆకట్టుకోగా, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఇగ్నో కోర్సులు



మాట్లాడుతున్న డాక్టర్ డీఆర్ శర్మ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగాలను సాధించడంలో పోటీని తట్టుకునే విధంగా ఇగ్నో కోర్సులను రూపకల్పన చేశారని ఇగ్నో ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్యాంపస్‌లోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) అందిస్తున్న కోర్సులతో పాటు 2024–జూలై సెషన్‌లో చేరిన అభ్యర్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ దేశంలోని సంప్రదాయ యూనివర్సిటీలకు భిన్నంగా ఇగ్నో వివిధ వర్గాల వారికి అవసరమైన కోర్సులను అందిస్తోందని, ఆయా కోర్సులను పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ సముపార్జనలో ప్రస్తుతమున్న పోటీని తట్టుకునేందుకు వీలవుతుందని అన్నారు. అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో అభ్యర్థులు ఇగ్నో సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఏఎస్‌యూ ప్రతినిధి డాక్టర్ ఎం.వసంతరావు మాట్లాడుతూ అభ్యర్థులకు అసైన్‌మెంట్స్, పరీక్షల సన్నద్ధతపై వివరించారు. టీజేపీఎస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీవీహెచ్‌కే శాస్త్రి మాట్లాడుతూ అభ్యర్థులకు ఇగ్నో అందిస్తున్న స్టడీ మెటీరియల్, ప్రాజెక్టు వర్క్ గురించి వివరించారు. స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఏ భానుమురళి మాట్లాడుతూ ప్రోగామ్స్‌తో పాటు అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.దేవేంద్రగుప్తా, వై.మార్కండేయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భరతమాత పూజా దినోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలోని శ్రీపద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం భరతమాత పూజా దినోత్సవం నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధరబాబు అధ్యక్షత వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థులు వీణ, గిటార్, కీబోర్డు, డ్రమ్స్ తదితర సంగీత పరికరాలతో పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి జనవరి 26వ తేదీ వరకు ప్రతి ఆదివారం పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీధరబాబు తెలిపారు. విజేతలకు బహుమతులను జనవరిలో ప్రదానం చేస్తామని వెల్లడించారు.

ప్రబంధమణి భూషణం గ్రంథావిష్కరణ



నగరంపాలెం: ప్రముఖ పండితులు కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కందుకూరి సత్య సూర్యనారాయణ మూర్తి ప్రతి పదార్థ, తాత్పర్య సహిత వ్యాఖ్యానం రాసిన కావ్యం ప్రబంధమణి భూషణం గ్రంథావిష్కరణ సభ ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై జరిగింది. అజో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ సంయుక్తంగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సంస్కృతి నిర్వాహకులు సర్రాజు బాలచందర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ సాహితీవేత్తలు గరిమెళ్ల అత్యుత సత్య శేషగిరి సోమయాజుల శర్మ గ్రంథాన్ని ఆవిష్కరించారు. సభలో సాహితీవేత్తలు డాక్టర్ సూర్యదేవర రవికుమార్, దేశం పాపిరెడ్డి, అజో విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, రంగస్థల సినీ నటుడు రచయిత వైఎస్ కృష్ణేశ్వరావు పాల్గొనగా, గ్రంథ వ్యాఖ్యాతలు కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కందుకూరి సత్యసూర్య నారాయణమూర్తిలను సత్కరించారు.

మంచి ఆహార అలవాట్లు అవసరం

డాక్టర్ సమరం



గుంటూరు మెడికల్: మధుమేహ బాధితులు సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే సంతోషకర జీవనాన్ని గడపవచ్చని ప్రముఖ వైద్యులు జి.సమరం తెలిపారు. మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్– డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'మధుమేహం– ఆహారం– జీవన సరళిలో మార్పులు' అనే అంశంపై శాస్త్రీయ అవగాహన సభకు డాక్టర్ సమరం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలు సానుకూల దృక్పథంతో జీవిస్తూ, రోజుకి కనీసం 8 గంటలపాటు నిద్రపోవాలని, తద్వారా ఒత్తిడి, ఆందోళనలను జయించవచ్చని తెలిపారు. హ్యాపీ లైఫ్ క్లబ్ వెల్‌నెస్ కోచ్ కె.శ్రీనివాస రాజు మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహారం గురించి శాస్త్రీయపరమైన అంశాలను వెల్లడించారు. ఆహార నియమావళి గురించి పలువురు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు. ఎస్ హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ టి.సేవ కుమార్, మానవత మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి, కె.శ్రీదేవి, కె.వెంకట నాగేంద్రప్రసాద్, సి.హెచ్.శివాజీ పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ జి.సమరంను డాక్టర్ రావి రంగారావు శాలువతో ఘనంగా సత్కరించారు.

రేపు కార్మిక సంఘాల బహిరంగ సభ



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ ముఠా వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఏటుకూరురోడ్డులోని ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సివిల్ సప్లయిస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బాబురావు, నాగేశ్వరరావు, సురభయ్య, అశోక్ రెడ్డి, సాంబయ్య, నవీన్, డేవిడ్, ప్రసాదు, రొయ్యల శీను పాల్గొన్నారు.